# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలో ఆధునికీకరించిన మూడువ రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.**

**2. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రుణ వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**3. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించిన మంత్రి నిమ్మల రామానాయుడు.**

**4. ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.**

==========================

దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఇంధనంలో నడిచే రైలును హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ అంతా పర్యావరణ హిత హైడ్రోజన్ ఇందనలో నడిచే వాహనాల దేనని అన్నారు. మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 75 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమం విధానంలో ఈ మధ్యాహ్నం జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని రాయనపాడు, మంగళగిరి, కంభం మూడు రైల్వే స్టేషన్లను ప్రారంభిస్తారు. దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి ప్రధాన కార్యక్రమం ఇదేనని డివిజన్ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి బాలాజీ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 28 సెకన్లు

-------------------------

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహిస్తున్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల “రుణ వితరణ కార్యక్రమం”లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద రైతులు, మహిళలు, యువత, ఇతర

రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద యూనియన్ బ్యాంక్ అందించిన అంబులెన్సులను ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

---------------------------

రాజధాని అమరావతి నిర్మాణ పనులను పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు జాతీయ రహదారితో అనుసంధానించే పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీడ్ యాక్సిస్ రోడ్డులో భాగంగా బకింగ్‌హామ్ కాలువ, కొండవీటి వాగుపై నిర్మిస్తున్న రెండు వంతెనల పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. విజయవాడ, మంగళగిరి నుంచి నేరుగా అమరావతికి చేరుకునేలా సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం కూడా వేగంగా సాగుతోందని  మంత్రి  వివరించారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని గోదావరి డెల్టా కాలువలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి గోదావరి ప్రవాహం తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ప్రస్తుతం డెల్టాకు గరిష్ఠంగా 14 వేల 700 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నప్పటికీ, శివారు ప్రాంతాల్లో నీటి కొరత ఉందని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.

---------------------------

ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా -ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పొగాకు కొనుగోళ్లపై విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో శ్రవణ మాధ్యమం విధానంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 2026--27 సీజన్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిని పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఇప్పటివరకు 12 కొవిడ్ కేసులు నమోదైనట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. గత నెల 26 నుంచి ఈ నెల 16 వరకు నాలుగు జిల్లాల్లో ఈ కేసులు నమోదయ్యాయని ఒక ప్రకటనలో తెలిపింది. కొవిడ్ బారిన పడి నలుగురు మృతి చెందగా, వారికి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో 67 నమూనాలను పరీక్షించగా 12 మందికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని కడపలో  8, గుంటూరులో  2, విశాఖపట్నం ,కాకినాడలలో ఒక్కొక్క కేసు చొప్పున నమోదైయ్యాయని ఆరోగ్య శాఖ పేర్కొంది. నమోదైన కేసులు వేర్వేరు ప్రాంతాల్లోనే ఉన్నాయని, సమూహికంగా ఎక్కడా ఒకేచోట అధికమొత్తంలో కేసులు బయటపడలేదని స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ

సూచించింది.

---------------------------

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 14 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నగర అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

అనంతపురం జిల్లాలో తల్లిద్రండులు – ఉపాధ్యాయుల సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించి, విద్యార్థుల విద్యాభివృద్ధి, రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలపై తల్లిదండ్రులతో చర్చిస్తామని తెలిపారు. తల్లిదండ్రులందరూ సమావేశానికి హాజరై తమ పిల్లల విద్యా పురోగతిని తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచిస్తూ...

వాయిస్ 28 సెకన్స్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 24వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.రోమ్ శాసనాన్ని చారిత్రాత్మకంగా స్వీకరించిన రోజుకు గుర్తుగా జూలై 17వ తేదీని న్యాయ దినోత్సవంగా జరపాలని 1998వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవంగా కూడా పిలుస్తారు. అంతర్జాతీయ నేరాలలో బాధితులకు న్యాయం జరిగేలా చేయడం, అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ కు మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించడం వంటివి ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆణివార ఆస్థానం వేడుకలను శాస్త్రోక్తంగా ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటా మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉభయదేవేరులతో మలయప్పస్వామిని గరుత్మంతునికి అభిముఖంగా వేంచేపు చేశారు. మరో పల్లకిపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనులను దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠించారు. అనంతరం ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీయర్లు మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను

సమర్పించారు. సాయంత్రం పుష్పపల్లకి వాహనంపై మలయప్పస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

======================